ఎమ్మార్సీ భవనం

ఎమ్మార్సీలో పరిశుభ్రత కరువు

- నమస్తే కథనానికి స్పందన
- తాత్కాలిక సిబ్బందిని నిమమించిన అధికారులు
- శాశ్వత సిబ్బందిని నియమించాలంటున్న టీచర్లు

దస్తురాబాద్, ఏప్రిల్ 4 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర శిక్షా అభియాన్ కింద ప్రత్యేక నిధులను కేటాయించి రూ. 31 లక్షలతో మండల విద్యా వనరుల కేంద్రం(ఎమ్మార్సీ) భవనాన్ని నిర్మించారు. ఇటీవల 'పేరుకే ఎమ్మార్సీ భవనం.. నిర్వహణ శూన్యం' పేరుతో నమస్తే తెలంగాణ పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు విడుతల వారీగా తాత్కలిక సిబ్బందిని నియమించారు. సీఆర్పీ, ఐఆర్పీలను ఎమ్మార్సీ భవనంలో విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు సిబ్బంది వస్తూ, వెళ్తున్నారు తప్ప ఏలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలేదు. అటెండర్ లేకపోవడంతో భవనంలో పరిశుభ్రత కరువైంది. గదులు వినియోగంలో లేక గబ్బిలాలు నివాసాన్ని ఏర్పర్చుకున్నాయి. ఎంతోవో గది, మరుగుదొడ్డిలో గబ్బిలాలు మలవిసర్జనతో నింపాయి. తాత్కాలికంగా నియమించిన సీఆర్పీ, ఐఆర్పీలు ఆ భవనంలో విధులు నిర్వహించాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. గబ్బిలాలతో ఎబోలా వైరస్ సోకుతున్న నేపథ్యంలో ఆ భవనంలోకి రావాలంటే ఉపాధ్యాయులు, విధులు నిర్వహించాలంటే సీఆర్పీ, ఐఆర్పీలు భయాందోళనకు గురవుతున్నారు. విధుల నిర్వహణకు అవసరమైన విద్యుత్ సౌకర్యం, కంప్యూటర్ కూడా లేకపోవడంతో ఇక్కడ ఎలా పనిచేయాలని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. అపరిశుభ్రత వాతావారణంలోనే పత్రాలు, రాగి ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. అటెండర్ను ,శాశ్వత సిబ్బందిని నియమించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మొక్కల రక్షణకు చలువ పందిళ్లు

- మండుతున్న ఎండల్లో నీటి తడులు
- 12 పంచాయతీల్లో లక్షా 20వేల మొక్కలు
- కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అప్రమత్తం

దిలావర్‌పూర్‌లో ఎండ వేడిమి నుంచి మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన చలువ పందిరిని పరిశీలించి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్(ఫైల్)

దిలావర్‌పూర్, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారానికి గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను ఉత్పత్తి చేశారు. మండలంలో మొత్తం 12 గ్రామ పంచాయతీలకు గాను ఒక్కో గ్రామ పంచాయతీకి 10 వేల చొప్పున మొక్కలు ఉత్పత్తి చేయాలని టార్గెట్ ఇవ్వడంతో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 12 గ్రామ పంచాయతీల్లో లక్షా 20 వేల మొక్కలు పెంచుతున్నారు.

మొక్కలు వాడిపోకుండా..

తీవ్రమైన ఎండల నుంచి మొక్కలను రక్షించాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశించడంతో గ్రామ పంచాయతీల్లో, గ్రామ కార్యదర్శులు మొక్కలు వాడిపోకుండా నీడ కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. మొక్కలకు వేడి గాలి తగలకుండా గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేసి, తరుచూ నీటి తడులు ఇవ్వడంతో మొక్కలు వాడిపోకుండా ఉంటున్నాయి. హరిత హారం కార్యక్రమం నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచుతున్నారు.

పచ్చదనం పెంచేందుకు చర్యలు..

భావితరాలకు పచ్చదనం అందించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం హరిత హారం కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా గ్రామాల్లో మొక్కలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. అడవిలో ఉన్న జంతువులు బయటకు రాకుండా ఉండేందుకు అడవిలో వివిధ రకాల మొక్కలతోపాటు పండ్ల మొక్కలు పెంచుతున్నారు.

గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేయాలి

నర్సరీల్లో మొక్కలు వాడిపోకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఇటీవలే మండల పర్యటనకు వచ్చిన అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ ఆదేశించడంతో మండల అధికారులు గ్రామాల్లో గ్రామ పంచాయతీ ద్వారా గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశారు. మొక్కల రక్షణకు చలువ పందిళ్లు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి.

మొక్కలు ఏపుగా పెరుగడానికి కృషి చేస్తున్నాం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు సజావుగా పెరుగడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో మొక్కలు ఎండ వేడిమి నుంచి వాడిపోకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయిస్తున్నాం. గడ్డి పెరుగకుండా కలుపు తీయిస్తున్నాం. నీటి తడులు అందించి ఎండ నుంచి మొక్కలను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

-దివ్యారెడ్డి , ఏపీవో (దిలావర్‌పూర్)

'ప్రధానమంత్రి ఉజ్వల యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

ముధోల్, ఏప్రిల్ 4 : ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న సూచించారు. గురువారం ముధోల్‌లో 12 మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్, స్టవ్, రెగ్యులేటర్లు, పైపులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, ఏప్రిల్ 4: ఖానాపూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు, వ్యాపారస్తులు సద్వినియోగం కోవాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం కోరారు. పట్టణంలో ఎన్టీఆర్ చౌరస్తా, ఆటవీశాఖ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోష్, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగనర్సయ్య, నాయకులు దయానంద్, రమేశ్, సురేశ్, సంతోష్, షబ్బీర్, సలీం పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పోస్టర్ల విడుదల

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 4: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రీయ కళామంచ్ సింగిడి పోస్టర్లను గురువారం నిర్మల్‌లో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ శశి మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటిలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు శశాంక్, జశ్వంత్‌గౌడ్, వంశీ, రాజ్ కుమార్, శ్రీనిత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందజేస్తున్న నారాయణ

ముధోల్, ఏప్రిల్ 4 : మహనీయుల ఆశయ సాధనకు కృషి చేస్తామని ముధోల్ బీసీ సంఘం అధ్యక్షుడు గుంజలోల్ల నారాయణ తెలిపారు. గురువారం బీసీ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి లక్ష రూపాయలు, జ్యోతిబాపూలే దంపతుల విగ్రహానికి రూ. 50 వేలు కమిటీ సభ్యులకు అందజేసి మాట్లాడారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం పదాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

శిశుమందిరాలు జ్ఞాన సముపార్జన కేంద్రాలు

విరాళాన్ని అందజేస్తున్న డాక్టర్ మహిపాల్

కుభీర్, ఏప్రిల్ 4 : శ్రీసరస్వతీ శిశుమందిరాలు విద్యార్థుల పాలిట జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా భాసిల్లుతున్నాయని భైంసా పట్టానికి చెందిన ప్రముఖ వైద్యుడు మహిపాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన కుభీర్ శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల కమిటీ సభ్యులకు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, పీరాజీ, ప్రధానాచార్యుడు హన్మాండ్లు, గోపాల్ కిషన్, హృషికేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

విద్యార్థులను పరామర్శిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 4: నర్సాపూర్ కేజీబీవీలో కల్తీ ఆహారం తిని అస్వస్థకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి మాట్లాడారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ విద్యార్థి సంఘం నాయకులు అరవింద్, శీతల్, దిగంబర్, ప్రవీణ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ ఉన్నారు.

మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు

తాంసి, ఏప్రిల్ 4: ఆకతాయిలు మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని షీటీం ఇన్‌చార్జి సుశీల అన్నారు. గురువారం కప్పర్ల గ్రామంలోనిజడ్పీఎస్‌హెచ్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు షీటీం విధులు, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఎవరైనా పోకిరీలు ఫొటోలు దిగి మోసం చేసినప్పుడు, దిగిన ఫొటోలను మార్పింగ్ చేసి వేరే వ్యక్తులకు షేర్ చేస్తానని బెదిరించి బ్లాక్ మెయిల్ చేసిన ఇబ్బందులకు గురి చేసిన వెంటనే షీటీం నంబర్ 8712659953కు ఫోన్ చేయాలని సూచించారు. ఎవరైనా బాధితులు డబ్బు నష్టపోయిన వెంటనే సైబర్ క్రైం నంబర్ 1930కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనంద్‌రావ్, షీటీం బృందం సభ్యులు సత్యమోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి

తానూర్, ఏప్రిల్ 4 : చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని బెల్ తరోడ చెక్‌పోస్టును సందర్శించి వాహనాలు, ఆర్‌టీసీ బస్సులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. నిషేధిత వస్తువులు, మద్యం, నాటు సారా, డబ్బు, ధ్రువపత్రాలు లేని విలువైన వస్తువులు రవాణా జరుగకుండా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఇక్కడ ఎస్ఐ లోకం సందీప్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏఎస్పీ కాంతిలాల్

రైతులకు లబ్ధి.. కూలీలకు 'ఉపాధి'

కొండాపూర్ చెరువు నుంచి నల్లమట్టిని ట్రాక్టర్‌లో నింపుతున్న ఉపాధి కూలీలు

సోన్, ఏప్రిల్ 4: గ్రామాల్లో చెరువులే కీలకం. వీటిపైనే సాగు ఆధారపడి ఉంటుంది. చెరువుల్లో నీరు నిల్వ ఉండడంతో భూగర్భజలాలు పెరుగుతాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా చెరువులు, కుంటల పూడిక పనులు ముమ్మరంగా చేపట్టారు. సోన్, నిర్మల్ మండలాల్లోని లోకల్ వెల్మల్, పాక్‌పట్ల, మాదాపూర్, కడ్తాల్, సాకెర, వెంగ్వాపేట్, రత్నాపూర్‌కాండ్లీ, కొండాపూర్, మేడిపెల్లి, నీలాయిపేట్ తదితర గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల ద్వారా పూడిక తీత పనులు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల పూడిక తీసిన నల్లమట్టిని పొలాల్లోకి తరలించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

అధిక దిగుబడి కోసం...

రైతులు అధిక దిగుబడులు సాధించేలా కొత్త పద్ధతులను ఎంచుకుంటున్నారు. నల్లరేగడి భూములు పంటలు పండించడానికి అనుకూలంగా ఉంటాయి. భూసారం ఎక్కువగా ఉండడమే కాకుండా నీరు ఇంకి చాలా కాలం తేమ ఉంటుంది. మండలంలోని పలు గ్రామాల్లో ఎర్ర మట్టి, చవుడుతో కూడిన భూములున్నాయి. వాటికి ప్రత్యామ్నాయంగా చెరువులోని నల్లమట్టిని ఎర్రనేలల్లో వేస్తే ప్రయోజనం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో సమానం

చెరువుల్లోని నల్లమట్టితో భూసారంతో పాటు పోషకాలు పెరిగి, వర్షపు నీరు ఇంకి పంటలు బాగా పండే అవకాశం ఉంటుంది. చెరువుల్లోని పూడిక మట్టిలో నత్రజని కిలోకు 720 మిల్లీగ్రాములు, భాస్వరం 820 మి.గ్రా, సేంద్రియ కర్బనం 9.1 గ్రాములు, మైక్రోబియం బయోన్ కార్బన్లు 308మి.గ్రా పోషకాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా తీస్తున్న మట్టిని రైతులు ట్రాక్టర్ల ద్వారా పొలాలకు తరలించుకుంటున్నారు. మట్టి పూడికతీయడం ద్వారా చెరువుల్లో నీటి సామర్థ్యం పెరిగే అవకాశం ఉంది.

పూడిక మట్టితో లాభాలు..

పూడికమట్టిని వినియోగించడంతో నేలలో తేమ నిల్వ సామర్థ్యం 4-7 రోజులకు పెరిగి పంటకు నీటి తడి ఇవ్వాల్సిన వ్యవధి పెరుగుతోందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పూడికమట్టిని వినియోగించడంతో హెక్టారుకు రూ. 2500 నుంచి 4 వేల వరకు రసాయన ఎరువుల వాడకం ఖర్చు తగ్గించుకోవచ్చంటున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

చెరువుల్లో నల్లమట్టిని రైతులు తమ పంట పొలాల్లో వేసుకుంటే మంచి దిగుబడులుంటాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతుల పంట పొలాల్లో వేసుకోవడం ద్వారా పాత మట్టిలో ఈ నల్లమట్టిని వేసుకుంటే మొక్కకు కావాల్సిన పోషకాలు లభిస్తాయి. ట్రాక్టర్ మట్టి రెండు డీఏపీ బ్యాగులతో సమానం. రైతులు ఈ నల్లమట్టిని సద్వినియోగం చేసుకోవాలి.

-తుల రామకృష్ణ, ఏపీవో(నిర్మల్ రూరల్)

బీఆర్ఎస్ నాయకుడి పరామర్శ

భైంసా, ఏప్రిల్, 4 : భైంసా మండలంలోని ఇలేగాం మాజీ సర్పంచ్ ముత్యం హైదరాబాద్‌లోని కేర్ దవాఖానలో బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. గురువారం బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల ముధోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ దవాఖానకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పక్షులకు సహాయంపై అవగాహన

మాట్లాడుతున్న సామాజికవేత్త వెంకటేశ్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 4: పట్టణంలోని విన్నర్ పాఠశాలలో గురువారం వేసవి కాలంలో పక్షులు, జీవరాసులకు సహాయం చేయడంపై సామాజికవేత్త వెంకటేశ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ పక్షులకు నీరు, ఆహారం అందించాలని సూచించారు. ఇండ్లల్లో పక్షి గూళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. జీవరాసులను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాజు, అశోక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

15లోగా దరఖాస్తులు సమర్పించాలి

ఎదులాపురం, ఏప్రిల్ 4 : అత్యవసర సేవా శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 15వ తేదీలోగా ఉద్యోగుల వివరాలతో కూడిన దరఖాస్తులు సమర్పించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం ఆయన చాంబర్‌లో సంబంధిత నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఎసెన్షియల్ సర్వీస్ (ఏవీఈఎస్) ఉద్యోగులకు ఎలక్షన్ కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వెసులుబాటు కల్పించిందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పార్లమెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే ఎసెన్షియల్ సర్వీస్ ఉద్యోగులు ఫారం 12డి తీసుకొని వాటిని నింపి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీపీఆర్వో తిరుమల, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి హరీంద్ర కుమార్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం సుధారాణి, ఫైర్‌స్టేషన్ అధికారి కేశవులు, స్టేషన్ ఫైర్ అధికారి శివాజీ, జనరల్ మేనేజర్ దేవదాస్, స్టేషన్ మాస్టర్, ఆర్టీసీ డీఎం కల్పన తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

లోకేశ్వరం: రాయపూర్ కాండ్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో గణేశ్

లోకేశ్వరం, ఏప్రిల్ 4 : రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి గణేశ్ కోరారు. గురువారం మండలంలోని రాయపూర్‌కాండ్లి, గొడిసెర గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో భూమేశ్, డీసీఎంఎస్ ఇన్‌చార్జి నాలం గంగాధర్, భోజరాం పటేల్, ఎల్లన్న, రమణారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, రాజేశ్వర్, రాజు, వీడీసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సారంగాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని సారంగాపూర్, జామ్, యాకర్‌పల్లి, జెవులి, వంజర్ గ్రామాల్లో గురువారం కౌట్ల(బీ) సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. గ్రేడ్-ఏ వరి ధాన్యానికి రూ. 2203, కామన్ గ్రేడ్ ధాన్యానికి రూ. 2183 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇక్కడ సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్‌రెడ్డి, ఏఈవోలు లావణ్య, శ్రీనివాస్, పీఏసీఎస్ సీవోఈ సలీమ్, సిబ్బంది గద్వాల రవి, మోహన్ పాల్గొన్నారు.

సారంగాపూర్: జామ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

అటవీ శాఖలో 'వన్ నేషన్.. వన్ పర్మిట్' అమలు

మాట్లాడుతున్న బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 4: అటవీశాఖలో వన్ నేషన్.. వన్ పర్మిట్ విధానం అమలు చేస్తున్నట్లు బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్ పేర్కొన్నారు. గురువారం నిర్మల్ అటవీశాఖ కార్యాలయంలో సామిల్ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో అడవులకు నిప్పు పెట్టడం ప్రమాదకరమన్నారు. గతంలో కర్ర కొనుగోలు చేసిన వారికి సామిల్ యజమానులే పర్మిట్ ఇచ్చేవారని ఇప్పుడు ఆపద్ధతి లేదని చెప్పారు. సామిల్ యజమానులు కర్రను విక్రయించినపుడు అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. రైతులు పంట పొలాల్లోని టేకు, ఇతర చెట్లను తొలగించాలన్నా ఆన్‌లైన్‌లోనే అటవీశాఖ అనుమతులు పొందాల్సి ఉంటుందని వివరించారు. సామిల్ యజమానులకు ఆన్‌లైన్ దరఖాస్తు విధానం పై అవగాహన కల్పించారు. సమావేశంలో నిర్మల్ డీఎఫ్‌వో తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

కడెం, ఏప్రిల్ 4 : ఉపాధి హామీ పనికి వచ్చే కూలీలకు పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని డీఆర్‌డీవో విజయలక్ష్మి ఆదేశించారు. మద్దిపడగలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. పెరిగిన కూలికి అనుగుణంగా డబ్బులు చెల్లించాలని, పని ప్రదేశంలో కూలీలకు నీరు, టెంట్ సదుపాయాలను కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం కొత్తమద్దిపడగ గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించి, లక్ష్మీసాగర్ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఆమె వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677